

# గుళికలు
## రమానాథ్ కందాళ



| గుళికల గురించి | |
|---|---|
| కుదురు రోగము: | అపూర్వ ప్రయోగములైనందున అనిర్ధారితము. |
| పదార్థములు - పాళ్ళు: | మీకు తెలిసిన మాకు తెలియచేయ మనవి |
| వాడకము: | నెలకో గుళిక |
| వాడుక సూచన: | గొంతునకడ్డము పడకుండ మింగవలెను. |
| హెచ్చరిక: | వికటించవచ్చు. వ్యసనలోలత కి అవకాశమున్నది. |
| ప్రత్యేక హెచ్చరిక: | హెచ్చరికని చూడుడు. |

# మర్రిచెట్టు

ఆ చెట్టు కింద సందడిగా ఉంది.

ఊడలు పట్టుకుని ఊగుతూ పిల్లలు నానా అల్లరీ చేస్తున్నారు. మానుచుట్టూ పరిగెడుతూ ఆటలాడుతున్నారు. ఊడల సాయంతో కొమ్మలమీదకి కోతుల్లా ఎక్కుతున్నారు. దబ్బున కిందకి దూకుతున్నారు. అదే పని ఎన్నిసార్లు చేసినా తనివి తీరుతున్నట్టు లేదు. చేసినపనే చేసుకుంటూ ఆనందించడం పిల్లలకి చేతనయినట్టు మరొకరికి కాదు. ఓ పిల్లాడు పట్టు తప్పి అంతెత్తు నుంచీ ధన్నున కింద పడ్డాడు. గెడ్డం చీలుకుపోయి బోలెడు రక్తం కారింది. అయినా వాడేం ఏడవలేదు. పెద్దయ్యేక కూడా వాడికది గుర్తుంటుంది. వాడేం చేస్తాడు? ఆచెట్టు వాణ్ణలా పురికొల్పింది మరి! అంతేసి పెద్ద పెద్ద ఊడలూ అదీ.. ఎవడికూగాల్నుండదూ?

ఆ చెట్టు కింద ఏదో గొడవవుతోంది.

ఒకణ్ణెవణ్ణో చెట్టుకి కట్టేసి కొడుతున్నారు. వాడేం చేసేడో మరి. ఎవరో ఆడమనిషి పక్కనుంచీ అడ్డుకుంటూ వొదిలీమని నెత్తీనోరూ బాదుకుంటోంది. వీధిన్యాయానికి తగ్గ విచారణ జరిగే ఉంటుంది. శిక్ష అమలవుతోంది. అంతా నిలబడి చూస్తున్నారు. చెట్టు అందరినీ చూస్తోంది. శిక్షయ్యేక అంతా ఎవరి దార్న వాళ్ళు పోయేరు. ఆడమనిషి వాడికి కట్లు విప్పి నీళ్ళు తాగించింది.

ఆ చెట్టు మీద గడబిడగాఉంది.

ఎక్కడెక్కణ్ణుంచొచ్చేయో సాయంకాలానికి..బోలెడు పక్షులు.. చెట్టు మీద వాలి బోలెడు కబుర్లు చెప్పి, గుబురాకుల్లో వెచ్చగా సర్దుకున్నాయి. రాత్రైంది. గాలి ఊసు లేదు. చెట్టు నిశ్చలంగా భేతాళ కథల పుట్టిల్లులా ఉంది. నిద్రలో పట్టు తప్పిందేమో ఏదో పక్షి కింద పడబోయి రెక్కలు టపాటపా కొట్టుకుంది. మిగతా పక్షులు కొన్ని లేచి రెక్కలాడించి హడావుడి చేసేయి. నిమిషంలో అంతా సర్దుకుంది. ఇదంతా మామూలే అన్నట్టు రాత్రి తనమానాన తను గడిచింది.

ఆ చెట్టు కింద బస్సాగింది.

ఎవరి అమ్మమ్మో సంచీతో బస్సు దిగింది. కట్టొదిలిన దూడల్లా మనవలు దూకుతూ పోయి అమ్మమ్మని వాటేసుకున్నారు. ముద్దుల వర్షం కురిసింది. పలకరింపులెవడిక్కావాలి? పెద్దసంచీ ఎందుకు తేలేదు, ఎక్కువరోజులుండవా? అని మనవలు గద్దిస్తున్నారు. మనవలు గద్దించినా కూడా అమ్మమ్మకి ముద్దే. మరిన్ని ముద్దులు పెట్టుకుంది. గబగబా గాలొచ్చి చెట్టాకుల్ని గలగల లాడించింది.

ఆ చెట్టు కిందే స్వాముల వారికి బస.

చల్లగా ఉంది, ఇక్కడే బస ఏర్పాటు చేసుకుంటాం అన్నారు. కానీమన్నారు ఊరిపెద్దలు. వార్త పాక్కింది. పాక్కకపోతే అనుకోవాలి. ఓహ్.. తీర్థంలా ప్రజ. క్యూలో నిలబడి ఎండలెక్క లేకుండా తోసుకున్నారు. విబూది పొట్లాలు పావలాకొకటి చొప్పున అమ్మేరు. స్వాములవారి ఫోటో చిన్నది రెండు రూపాయిలు, పెద్దది మూడున్నర. వేడి పకోడీల్లా చెల్లేయి. ఏదన్నా వేడిగా ఉన్నప్పుడే కద. స్వాముల వారు చెట్టు మొదట్లో నీడన కూచున్నారు. భక్తులు వీలైనంత మందికి చెట్టు నీడ పరిచింది.

ఆ చెట్టు కింద డేరా వేసేరు.

పండగొచ్చింది. డేరాలో దేవుడి బొమ్మ పెట్టేరు. చెట్టుకి పసుపు కుంకుమలు పెట్టి, కొమ్మలకి రంగు కాగితాల తోరణాలు కట్టేరు. రాత్రయాసరికి ఆరీ వెలిగీ లైట్లు పెట్టేరు. చెట్టు మానుకి అటూ ఇటూ లౌడు స్పీకర్లు కట్టి వాతాపీ, దినకరా వేసేరు. ఊరందరికీ అవి వినబడ్డాయి. పూజారొచ్చి యామీ, నమహాలు మాత్రమే వినబడేట్టు మంత్రాలు చదివేడు. స్పెషలు దర్శనం కోసం ప్రెసిడెంటు గారొచ్చేరు. కూతురి చేత కుంకుమార్చన చేయించేరు. పండగన్నన్నాళ్ళూ చెట్టు పెళ్ళికూతుర్లా కళ కట్టింది.

ఆ చెట్టుకి చీమ కుట్టినట్టు లేదు, అవేళొచ్చిన గాలివానకి.

మహామహా 'వటష్మాజాలే' పటాపంచలైపోయేయ్. చెట్టు చలించలేదు. గాలి బలే పెనుగులాడింది. వానని తోడు తెచ్చుకుంది. ఇటుంచటూ,అటుంచిటూ గాలీ, వానా శతవిధాల పోరేయి. తగ్గేయి, హెచ్చేయి, తగ్గుతున్నట్టే తగ్గి ఒక్కసారి విర్చుకు పడ్డాయి. ఏ విత్తు సత్తువో కానీ చివరకి చెట్టు గెలిచింది. నిబ్బరంగా నిలిచింది.

ఆ చెట్టుకింద ఒక టాటాసూమో ఆగింది.

నలుగురో అయిదుగురో దిగేరు. ఏవో కాయితాలు తీసేరు.. ఈశాన్యమ్మూల.. అటు పదిగజాలు.. ఇటు పాతిక..అని ముక్కలు ముక్కలుగా మాట్లాడుకున్నారు. చెట్టూ, దానిని ఆనుకునున్న ఖాళీ జాగా, అటువైపు పొలం.. అన్నీ కొలుచుకున్నారు. ఓ గంట పట్టింది. అయితేనేం కొలతలు కుదిరేయి. టాటాసుమో వెళిపోతున్నప్పుడు రేపిన దుమ్ములో చెట్టు మసకైంది.

ఇంకొన్నాళ్ళకి..

ఆ చెట్టుకింద ఏ గొడవాలేదు. ఇంకా కిందేవిటి, అసలు చెట్టే లేకపోతే. తోటలకి తోటలే ప్లాట్లయిపోతూంటే ఈ వెర్రిచెట్టొక్కొటీ వెలగబెట్టేదేవుంది? దీనికేవన్నా కొమ్ములు మొలిచేయా? ప్రభంజనాల్నీ అశనిపాతాల్నీ ఆపిందేమో కానీ రంపపుకోతని ఆపడానికి ఇదేవన్నా పెట్టిపుట్టిందా? కాకపోతే కాస్త ముందే తెలిసుంటే బావుణ్ణు. వాటేసుకుని బావురుమందును. అమ్మమ్మ ఊరెళిపోతూ ఉంటే మనవలు అలాగే ఏడ్చేరు వాటేసుకుని వదలకుండా. మనవలకి కనబళ్ళేదు కానీ అమ్మమ్మ కూడా ఏడ్చింది.